క్లుప్తంగా

రికార్డులు ఎప్పటికప్పుడు సరి చూడాలి



కోరుట్ల ఏవో కార్యాలయంలో రికార్డులు చూస్తున్న డీఏవో వాణి

కోరుట్ల రూరల్: వ్యవసాయ అధికారి కార్యాలయంతోపాటు అన్ని రైతు వేదికల్లో రికార్డులు ఎప్పటికప్పుడు సరి చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. కోరుట్లలో వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని డీఏవో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. ఏఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించి మండలంలో పంటల పరిస్థితి, కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి లైసెన్సులు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈవోలు పాల్గొన్నారు.

నాటు కోళ్ల పెంపకంపై రైతులకు శిక్షణ



కరపత్రాలతో రైతులు, కళాశాల ప్రొఫెసర్లు

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో మేడిపెల్లి మండల రైతులకు నాటు కోళ్ల పెంపకంపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పశుగణ క్షేత్ర సముదాయ విభాగ అధిపతి డాక్టర్ శ్రీదేవి నాటు కోళ్ల పెంపకంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, ప్రాముఖ్యతపై రైతులకు వివరించారు. నాటు కోళ్ల పెంపకంలో గృహ నిర్మాణం, దాణా ప్రాముఖ్యత, నాటు కోళ్లలో వచ్చే వ్యాధులు వాటి నివారణపై పలువురు ప్రొఫెసర్లు వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ తక్కళ్లపల్లి మాధవరావు రైతులకు కోళ్ల పెంపకానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు దైవక్రిష్ణ, సుష్మ, రవికాంత్, సురేశ్, శిరీష, రమ్య, సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన




విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి విజ్ఞాన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుకు ఎంపిక కాగా, వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి వాసవి, అధ్యాపకులు శనివారం అభినందించారు. విద్యార్థుల్లో అధ్యయనం పట్ల ఆసక్తిని కలిగించి, వారిలోని అధ్యయన నైపుణ్యాలను వెలికి తీయటానికి కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాజెక్టుకు కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక కావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం కెమిస్ట్రీ, తెలుగు, కామర్స్, విభాగాల్లో 14 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బూర్ల నరేశ్, ప్రతిమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిత్రుడి వైద్యానికి రూ.లక్ష ఆర్థికసాయం

పెగడపల్లి: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న యువకుడి వైద్యం కోసం తోటి మిత్రులు ఆర్థిక సాయం అందజేసి తమ ఉదారత చాటుకున్నారు. మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన తుమ్మ లక్ష్మణ్ అనే యువకుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నెల రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే లక్ష్మణ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలిసి, 2007లో ఆయనతో పదో తరగతి చదువుకున్న మిత్రులు కలిసి తమ వంతుగా తల కొంత జమచేసిన సొమ్ము రూ. లక్ష శనివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో రాకేశ్, మనోహర్, సంతోష్, మోహన్, మహేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



జగిత్యాలరూరల్: అర్బన్ మండలం మోతె శివారులోని నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సత్సంగ్ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలగాని ప్రేమలత, వొద్ది శ్రీలత, జమున, ఝాన్సీ పాల్గొన్నారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి ఏది?

- ఎర్దండి గంగామాత ఆలయం వద్ద వసతులు కరవు
- భక్తులకు ఇబ్బందులు
- గోదావరి ఉధృతికి భారీగా నష్టం
- పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు



దుస్తులు మార్చుకునే గదులకు ఊడిపోయిన రేకులు



గోదావరి వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయిన మినీ వాటర్‌ట్యాంక్

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి శివారులో గోదావరి పక్కన ఉన్న గంగామాత ఆలయం వద్ద వసతులు కరువవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి వద్దకు వివిధ జిల్లాల నుంచి ప్రతీ సోమవారం, బుధవారం, శుక్రవారం మొక్కులు చెల్లించుకునేందుకు అనేకమంది భక్తులు వస్తారు. కానీ ఇక్కడ దేవాదాయ శాఖ అధికారులు సరైన వసతులు కల్పించకపోవడంతో భక్తులు నానాతంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్నేళ్లుగా భక్తులకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వసతులు కల్పించి వివిధ రకాల టికెట్లతో వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధి కమిటీ తీసుకునేది. ప్రతి ఏడాది రూ.4 లక్షల ఆదాయం రావడంతో కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించేవారు. 2007లో ఈ పుణ్యక్షేత్రాన్ని దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి భక్తులకు సరైన వసతులు కరువయ్యాయి. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం పుష్కరఘాట్‌లు, భక్తులు స్నానాలు చేసేందుకు గాను ప్రత్యేకంగా షవర్లను ఏర్పాటు చేసింది. స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలికంగా గదులు ఏర్పాటు చేసింది. నూతనంగా గంగామాత ఆలయాన్ని నిర్మించారు. కానీ షవర్లు పనిచేయకపోవడంతో భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు గదులు లేక నానాతంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. చెత్తచెదారాన్ని కూడ తొలగించే వారు లేక అపరిశుభ్రత నెలకొంది. దేవాదాయశాఖ వారు ప్రతి సోమ,బుధ, శుక్ర వారాల్లో వాహనాల పార్కింగ్‌కు రూ. 20 నుంచి 30 వరకు, తెప్పలు, మేకలు కోయడానికి రూ.150 , కేశఖండనానికి రూ. 50లతో పాటు ప్రతీ ఏడాది దుకాణదారుల వద్ద కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. దీని ద్వారా సంవత్సరానికి రూ. 7 నుండి 8 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దేవాదాయ శాఖ మాత్రం రూ.50 వేలు మాత్రమే వస్తుందని చెబుతున్నారు. ఈ పుణ్యక్షేత్రాన్ని దేవాదాయ శాఖ నుంచి తీసివేసి గ్రామానికి అప్పగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

గోదావరి ఉధృతికి భారీగా నష్టం

గతేడాది భారీ వర్షాలతో ఎస్సారెస్పీ నుంచి గోదావరిలోకి లక్షల క్యూసెక్కుల నీటిని వదలడంతో గోదావరి వద్ద వరద ఉధృతికి భారీగా నష్టం వాటిల్లింది. గంగామాత ఆలయం వద్ద నిర్మించిన మినీ వాటర్ ట్యాంకులు కొట్టుకుపోయాయి. భక్తుల కోసం నిర్మించిన గదులలో కిటికీలు సైతం వరదలో కొట్టుకపొయాయి. పుష్కర ఘాట్‌లకు వచ్చే రోడ్డు ధ్వంసమైంది. ఇంత నష్టం వాటిల్లినా అధికారులు పట్టించుకోక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి కూడా భక్తులు అవస్థలు పడుతున్నారు. ప్రతీ ఏడాది గోదావరి వద్ద శంకర గౌరి మాత కల్యాణాన్ని గ్రామస్తులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకుని భక్తులకు వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



ప్రతీ ఏడాది గోదావరి ఉధృతికి నష్టం వాటిల్లుతోంది. దేవాదాయ శాఖ వారు భక్తుల సౌకర్యాల గురించి పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో డబ్బులు ఖర్చు పెట్టి భక్తులకు సౌకర్యం కల్పిస్తున్నారు. స్వామివారి కల్యాణం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నాం. అధికారులు పట్టించుకోవడం లేదు.

– గాజె రాజన్న , గ్రామస్తులు, ఎర్దండి

వసతులు కల్పించాలి



ఎర్దండి గోదావరికి వివిధ జిల్లాల నుంచి అనేక మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ముఖ్యంగా స్త్రీలు గోదావరిలో స్నానం ఆచరించిన తర్వాత బట్టలు మార్చుకునేందుకు వసతులు లేవు. దీంతో స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలికంగా అయినా ఏర్పాట్లు చేయాలి.

– తలారీ వర్ష, గ్రామస్తురాలు, ఎర్దండి

నిధులకు ప్రతిపాదనలు పంపించాం

నిధులు లేక వసతులు కల్పించలేకపొతున్నాం. తాత్కాలికంగా స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు రేకులతో ఏర్పాటు చేస్తే దొంగలు ఎత్తుకెళ్తున్నారు. పూర్తిస్థాయి ఏర్పాట్ల కోసం నిధులు మంజూరు చేయాలని పై అధికారులకు విన్నవించాం. నిధులు మంజూరు కాగానే భక్తుల కోసం అన్ని వసతులు ఏర్పాటు చేస్తాం. ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం.

– విక్రమ్ గౌడ్, దేవాదాయ శాఖ, ఈవో

చిరుధాన్యాల్లోనే అధిక పోషకాలు





అయిలాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్.. మద్దులపల్లిలో ప్రతిజ్ఞ

పెగడపల్లి: చిరుధాన్యాల్లోనే అధిక పోషకాలు లభిస్తాయని ఇంటిలో లభించే చిరుధాన్యాలను భోజనంలో ఎక్కువగా తినాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ పక్వాడ పక్షోత్సవాలు ముగిశాయి.శనివారం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం , వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

కోరుట్ల రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అయిలాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం మిల్లెట్స్‌పై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షైని మాథ్యూ, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన అందించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు.జగిత్యాల రూరల్ సంగంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సోమన్‌పల్లి సెక్రటరీ కనకలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

జగిత్యాల: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవితరాణి అన్నారు. శనివారం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తహీనతను అధిగమించాలంటే పోషకాహారం తీసుకోవాలని, పోషకాహార లోపంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దయావతి, అరుణ, యతీశ్వరి, కళావతి, మాధవి, సీమ పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి రైతుల సమస్యలు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమైన విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్

ధర్మపురి: రైతుల సమస్యలపై దృష్టి సారించాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డికి విన్నవించారు. శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ధర్మపురి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన మంత్రి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రికి విప్ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: కోరుట్ల 25వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అన్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, ఆడెపు మధు, ఖయ్యూం, నజీబోద్దీన్, హఫీజ్, సద్గురు, రజీ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ సంబరాలు



హోలీ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లి మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు హోలీ సంబరాలు జరుపుకున్నారు. అందరూ రంగులు పూసుకుంటూ హోలీ వేడుకలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నితిన్‌కుమార్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ....

మల్యాల: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. తక్కళ్లపల్లిలో పోషణ్ పక్వాడ్‌లో భాగంగా పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించిన అనంతరం హోలీ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లుసైతం ఒకరికొకరు రంగులు పూసుకుని, హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు రజిత, అంగన్‌వాడీ టీచర్లు మమత, బాబాయి పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి,వివేకవర్ధిని ఉన్నత పాఠశాలల్లో శనివారం ముందస్తుగా హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. హోలీ విశిష్టతపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు కైరం సత్యంగౌడ్,మచ్చ గంగాధర్, డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రా రైస్‌మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడు



సీఎంతో శ్రీనివాస్

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా రా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూనె శ్రీనివాస్ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

అవార్డు సెలెక్షన్ కమిటీ మెంబర్‌గా గంగారెడ్డి



గంగారెడ్డి

బుగ్గారం: ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీల సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న జాతీయ స్థాయి సంస్థ బహుజన సాహిత్య అకాడమీ సంస్థను విస్తరింపజేస్తోంది. దీనిలో భాగంగా జగిత్యాల జిల్లా అవార్డు సెలెక్షన్ కమిటీ మెంబర్‌గా చుక్కా గంగారెడ్డిని నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఇబ్రహీంపట్నం : మండలంలోని వేములకుర్తిలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో ఆలయకమిటీ చైర్మన్ నరేందర్, అర్చకులు నర్సింహమూర్తి, రాజశ్రీనివాస్, జానకి రామకృష్ణ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పశుసంరక్షణపై రైతులు దృష్టి సారించాలి



పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారులు

మెట్‌పల్లిరూరల్: పశు సంరక్షణపై రైతులు దృష్టి సారించాలని పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బక్కయ్య అన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం ప్రారంభించారు. పశువులను పరీక్షించి రైతులకు పలు సలహాలు,సూచనలు చేశారు.అనంతరం మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పశుసంరక్షణ విషయంలో రైతులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పశువుకు ఏదేని వ్యాధి సోకితే వెంటనే స్థానిక పశువైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మనీషాపటేల్, కోరుట్ల పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు పరశురాం, విశాల్, సురేశ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు శనివారం గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 202 గేదెలకు, 4 తెల్ల పశువులకు టీకాలు వేసినట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.బక్కయ్య తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో పశువులకు శనివారం అదనపు వైద్యాధికారి నరేశ్ గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని కోరారు.కార్యక్రమంలో రైతులు రాజేశ్, గంగారం, సాయిరెడ్డి, పోచయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై గౌతంపవార్

సారంగాపూర్: ప్రజలు సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి ప్రజలు మోస పోయేవారి సంఖ్య పెరుగుతుందని ఇది ఆందోళన కలిగించే అంశమని ఎస్సై గౌతంపవార్ అన్నారు. బీర్‌పూర్ మండలం చెర్లపల్లిలో పోలీసు కళాబృందాలు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. తల్లితండ్రులు పిల్లలపై ఎప్పుడు దృష్టిపెట్టాలని, వారు ఉన్నత చదువులు చదివేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శిగా సుతారి శ్రీనివాస్



శ్రీనివాస్

కోరుట్ల: కోరుట్ల బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది సుతారి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు మచ్చ రమణమూర్తి, చెన్న విశ్వనాథం, వోటారికారి శ్రీనివాస్, సంగ విజయ్ తెలిపారు. ఈ నెల 28న బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయని, పలు పదవులు ఏకగ్రీవం అయ్యాయని వారు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా తోట ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా మద్దుల రాజు, కోశాధికారిగా చిలువేరి రాజశేఖర్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి న్యాయవాదులు భైరి విజయ్, తన్నీరు శ్రీనివాస్‌రావు పోటీలో ఉన్నారని, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు పలువురు పోటీ పడుతున్నట్లు తెలిపారు.

గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గం

మెట్‌పల్లి: పట్టణ గంగపుత్ర సంఘ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్మూర్ నరేందర్, గౌరవ అధ్యక్షులుగా తోపారపు రాజేందర్, ఆర్మూర్ దుబ్బరాజయ్య, ఉపాధ్యక్షుడిగా ఆర్మూర్ పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా మగ్గిడి సురేశ్, కోశాధికారిగా న్యావనంది రాజేందర్, సహాయ కార్యదర్శిగా వాల్గొట్ సాయిలులను సభ్యులు ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీ



జెడ్పీటీసీకి కండువా కప్పుతున్న దీపాదాస్ మున్షి

పెగడపల్లి: మండల జెడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, ల్యాగలమర్రి ఎంపీటీసీ మందపల్లి అంజయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లో శనివారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వం విప్ లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా ఆమె వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విప్ లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎంపీపీ

గొల్లపల్లి: బీఆర్ఎస్ పార్టీకి చెందిన వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాస్‌రావు తన అనుచరులతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల ముందునుంచే పొనుగోటి బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. త్వరలో మరికొంత మంది కూడా కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు సమాచారం. తాము ఎలాంటి ప్రలోభాలకు గానీ, ప్యాకేజీలకుగానీ పార్టీ మారలేదని పొనుగోటి స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌కు చెందిన ద్యావతి పోతరాజుల సంక్షేమ సంఘం, ఒడ్డెలింగాపూర్‌లోని గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు.

వైన్స్ తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాలరూరల్: సారంగాపూర్ మండల కేంద్రానికి మంజూరైన మద్యం షాపును నిబంధనలకు విరుద్ధంగా లక్ష్మీదేవిపల్లికి తరలించడంపై గ్రామస్తులు శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సారంగాపూర్‌కు మంజూరైన వైన్స్‌ను లక్ష్మీదేవిపల్లికి తరలించడంపై గ్రామస్తులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. సారంగాపూర్‌లోనే నిర్వహించాలని ఆదేశాలు జారీచేసినా లక్ష్మీదేవిపల్లిలోనే నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

వ్యాపారులకు జరిమానా

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లల్లో శనివారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు చోట్ల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.4వేల జరిమానా వసూలు చేశారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల కవర్లను వాడొద్దని సూచించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, పున్నం, నిజాం, నరేశ్, శేఖర్ తదితరులున్నారు.

టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి సత్కారం

జగిత్యాల: టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ పీఆర్వో చంద్రశేఖర్ ఇటీవల బదిలీపై కొండగట్టు అంజన్న ఆలయ పీఆర్వోగా రాగా, టీఎన్జీవో నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మామిడి రమేశ్, జిల్లా ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రసాద్, శ్రీనివాస్, మల్లయ్య, నగేశ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్‌పోలింగ్

రాయికల్: పట్టణంలోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగం, గెలిచిన అభ్యర్థి ప్రమాణస్వీకారం, పార్లమెంట్‌లో ఉభయసభల సమావేశం వంటి కార్యక్రమాలను విద్యార్థుల తో చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కైరం సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

కథలాపూర్: మండలంలోని సిరికొండలో యువకులు, విద్యార్థులు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం నివాళి అర్పించారు. దేశానికి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యువకులు కాసోజి ప్రశాంత్, గాంధారి శ్రీనివాస్, గంగనర్సయ్య, మనీశ్, అశోక్‌గౌడ్, వెంకటేశ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుగ్గిళ్ల వెంకటేశ్‌కు ఉత్తమ సేవా పురస్కార్

జగిత్యాలటౌన్: సామాజిక సేవకుడు గుగ్గిళ్ల వెంకటేశ్‌కు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందించిన వారికి మోక్ష గ్లోబల్ ఫౌండేషన్ వారు ప్రతి ఏటా అవార్డులు అందజేస్తున్నారు. సామాజిక కళా రంగాల్లో చేసిన సేవలకు జగిత్యాల జిల్లా సంగెంపల్లికి చెందిన గుగ్గిల్ల వెంకటేశ్‌కు ఉత్తమ సేవా పురస్కార్ అవార్డును శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో అందజేశారు.